అటకెక్కిన 'అటల్ టింకరింగ్'

- అలంకారప్రాయంగా మారిన సైన్స్ ప్రయోగశాలలు
- ఇప్పటికీ మెంటార్‌ను నియమించని అధికారులు


నిరుపయోగంగా ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్ పరికరాలు


వైరాలోని గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్

వైరా: చిన్నారుల మదిలో మెరిసిన తార్కిక ఆలోచనను ప్రోత్సహించి శాస్త్రీయ దృక్పథం వైపు మళ్లించేందుకు కేంద్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)లను 2018లో మంజూరు చేసింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను శాస్త్ర, సాంకేతిక విజ్ఞానపరంగా తీర్చిదిద్దేందుకు మారుమూల ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక పరికరాలతో కూడిన ప్రయోగశాలలను ఏర్పాటు చేయిస్తోంది.

నాణ్యమైన విద్య అందించేందుకే..

ఇలా రోబోటిక్ పరిజ్ఞానాన్ని విద్యార్థుల చెంతకు తీసుకువచ్చిన ఇవి క్షేత్రస్థాయిలో సరైన నిర్వహణ లేక అలంకరప్రాయంగా మారాయి. పది, ఇంటర్ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించటంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్న పాఠశాలలను ఎంపిక చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ మిషన్ కింద అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను మంజూరు చేసింది.

ఒక్కో ప్రయోగశాలకు రూ.20 లక్షలు..

జిల్లాలోని వైరా, మధిర, ఖమ్మం పాఠశాలల్లోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు వీటిని వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఒక్కో ప్రయోగశాలకు అయిదేళ్లలో రూ.20 లక్షలు మంజూరు అవుతాయి. మొదటి సంవత్సరంలో రూ.12 లక్షలు, మిగిలిన నాలుగేళ్లలో ఏటా రూ.2 లక్షల చొప్పున విడుదల అవుతాయి. ఈ నిధులతో త్రీడీ ప్రింటర్లు, ప్రయోగశాలలు, సైన్స్ కిట్లు, అత్యాధునిక కంప్యూటర్లు, డ్రోన్లు, కుట్టుమిషన్, టెలిస్కోప్, ఎలక్ట్రానిక్ రోబోటిక్, ప్రాజెక్టర్ ఇతర ప్రయోగ వనరులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

రెండేళ్లుగా నిర్లక్ష్యం..

అయిదేళ్లు కొనసాగే ఈ కార్యక్రమానికి ఒక్కో పాఠశాలకు మొదట రూ.10 లక్షలు మాత్రమే ఇచ్చారు. తర్వాత రూ.2 లక్షల చొప్పున ఏటా మంజూరు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. కరోనా నేపథ్యంలో వాటి గురించే మరిచారు. నిర్వహణకు నిధులు రాకపోవడంతో ప్రయోగశాలలన్నీ మూతపడ్డాయి. ప్రతి పాఠశాలకు ల్యాబ్‌లో విద్యార్థులకు నేర్పించాల్సిన మెంటర్లు లేకపోవడం కూడా సమస్యగా మారింది. ప్రతినెలా మెంటార్లకు రూ.5 వేల వేతనం చెల్లించాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ ఆ వేతనం సరిపోవడం లేదని మెంటార్లు బోధించేందుకు ముందుకు రావడం లేదు. ప్రారంభమైన కొన్ని నెలలు మాత్రమే టింకరింగ్ సంస్థకు చెందిన ప్రతినిధులు వచ్చి విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో పరికరాలపై అవగాహన కల్పించి ల్యాబ్‌లను విద్యార్థులకు పరిచయం చేశారు. తర్వాత మెంటర్లను ఏర్పాటు చేయకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది.

ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్న సమయంలో కొవిడ్ రావటంతో దాదాపు రెండేళ్ల పాటు వీటి నిర్వహణ అటకెక్కింది. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు వాటి జోలికి వెళ్లడం లేదు. జిల్లా అధికారులు ప్రత్యేకగా దృష్టిసారించి నిధులు మంజూరు చేయించటంతోపాటు ప్రయోగశాలలు మళ్లీ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించాలి..



పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలే విద్యార్థినులకు తరగతులు బోధిస్తున్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఇన్‌స్ట్రక్టర్ ఉంటే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇటీవల జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రయోగత్మక విద్య ఎంతో ఉపయోగపడుతుంది.

– రమ, ప్రిన్సిపాల్

ఆసక్తి సన్నగిల్లుతోంది..



సాంకేతిక పరిజ్ఞానంపై నాకు అవగాహన ఉండేది కాదు. మా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్ చూశాక ఆనందం కలిగింది. శిక్షకుల ఆధ్వర్యంలో స్వయంగా చిన్న ప్రాజెక్ట్‌లు చేయడంతో నాపై నమ్మకం ఏర్పడింది. ప్రారంభంలో ఒక నెల మాత్రమే తరగతులను నిర్వహించారు. మెంటార్లు లేకపోవడంతో ఆసక్తి సన్నగిల్లుతోంది.

– సీహెచ్.కీర్తన, 9వ తరగతి, వైరా

రోజువారీగా తరగతులు..



సైన్స్ ల్యాబ్‌లో రోజూ తరగతులు నిర్వహించాలి. ప్రత్యేక శిక్షకులు లేకపోవడంతో చాలా రోజులుగా ల్యాబ్‌లోకి అడుగు పెట్టలేదు. వారం కిందట ఓ శిక్షకురాలు వచ్చి అయిదు రోజుల పాటు వివిధ అంశాలపై ప్రయోగాలు చేయించారు. ఉన్నతాధికారులు స్పందించి శిక్షకులను నియమించి తరగతుల నిర్వహణ జరిగేలా చూడాలి.

– ఈ.స్వప్న, 10వ తరగతి, వైరా

మెంటార్లు తప్పనిసరి..



అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో చేయించే ప్రాజెక్ట్ పనులు విద్యార్థులను ఎంతో ప్రభావితం చేస్తాయి. చిన్న చిన్న సమస్యలను అధిగమించడం, కొత్త విషయాలను తెలుసుకోవటంలో ఆసక్తి ఒక అంశంపై క్షుణ్ణంగా ఆలోచన చేయడం అలవాటు అవుతుంది. ఏటా నిర్వహణ నిధులు మంజూరు చేయడంతోపాటు మెంటార్లను ఏర్పాటు చేయాలి.

– వి.లీలావతి, ఫిజికల్ సైన్స్ టీచర్, వైరా

క్లుప్తంగా

పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించాలి


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు

ఏన్కూరు: పిల్లల ఆరోగ్యంపై ప్రధాన దృష్టి సారించాలని తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు కోరారు. మండలంలోని పలు హాస్టళ్లను సోమవారం ఆయన తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బీసీ హాస్టల్‌ను సందర్శించారు. వంట గదులను, టాయిలెట్లను, వంటసరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి ఉషారాణి పాల్గొన్నారు.

అటవీ ఉద్యోగుల సేవలు గుర్తించాలి

తల్లాడ: అటవీ పరిరక్షణలో అహర్నిశలు పని చేస్తున్న అటవీశాఖ ఉద్యోగుల శ్రమను గుర్తించి రాబోయే పీఆర్సీలో సముచిత స్థానం కల్పించాలని సత్తుపల్లి అటవీ యూనిట్ అధ్యక్షుడు బి.శ్రీను అన్నారు. తల్లాడ అటవీక్షేత్ర కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇతర యూనిఫాం శాఖలతో సమానంగా వేతనం కల్పించాలన్నారు. గత పీఆర్సీలో అటవీ శాఖ ఉద్యోగులకు సరైన వేతనం లేదని తెలిపారు. త్వరలోనే మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యలను విన్నవించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సత్తుపల్లి యూనిట్ ఉపాధ్యక్షుడు ఎ.భరత్‌కుమార్, జనరల్ సెక్రటరీ ఎల్.రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.క్రిష్ణమూర్తి, వి.సాంబయ్య, ఎండీ.అజామ్ ఆలీ పాల్గొన్నారు.

పరామర్శ..

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ జిల్లా నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తిని, అదే విధంగా నూతనకల్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గణేశులు శ్రీనివాసరావు కుటుంబాన్ని సోమవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పరామర్శించారు. జక్కంపూడి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకొన్నాక.. మృతుడి శ్రీనివాసరావు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రఘుపతిరెడ్డి, కృష్ణయ్య, ప్రభాకర్‌రావు, రామప్పారావు, గణేశలు రవి, కొమ్మినేని ప్రభాకర్‌రావు, రాయల రాము, వడ్డే రామారావు, మీర్జా మహబు, పైడిపల్లి రవి.బండారుపల్లి రాము, పాసంగులపాటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి నివాళి

మధిరరూరల్: మధిర మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ హరికిరణ్ మృతదేహానికి సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ నివాళి అర్పించారు. హరికిరణ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని జెడ్పీ చైర్మన్ సందర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు చావా వేణు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, చిత్తారు నాగేశ్వరరావు, కరివేద సుధాకర్ తదితరులు ఉన్నారు.

అధికారుల సంఘం అధ్యక్షుడికి వినతి

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ఓసీ సెకండ్ క్లాస్ మైనింగ్ అధికారుల పదోన్నతి విషయమై కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటాచారిని కలిసి వినతిపత్రం అందించారు. డిప్యూటీ మేనేజర్ ఈ–4కు రావాల్సిన పదోన్నతి ఆలస్యం అవుతున్న కారణంగా.. నష్టపోతున్నామని వీలైనంత త్వరగా ప్రమోషన్ ఇప్పించాలని కోరుతూ సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్.వెంకటాచారి మాట్లాడుతూ.. సెకండ్‌క్లాస్ మైనింగ్ అధికారుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, అదేవిధంగా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ మేనేజర్ పి.నర్సింహారావు, మేనేజర్(ఆపరేషన్స్) జి.దుర్గప్రసాద్, అధికారుల సంఘం సంయుక్త కార్యదర్శి ప్రదీప్‌కుమార్, వేమారెడ్డి, రాజేష్‌రెడ్డి, నూకల రాజు, సంతోష్‌కుమార్, వేణుబాబు, దుర్గప్రసాద్‌రెడ్డి, కమల్‌దీప్ పాల్గొన్నారు.

సెలవు ప్రకటించాలి

కారేపల్లి: మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినాలను ప్రకటించాలని ఆదివారీ సంక్షేమ పరిషత్ కారేపల్లి మండల అధ్యక్షుడు యదళ్లపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కారేపల్లిలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆసియా ఖండంలోనే అత్యంత ఆదరన కలిగిన ఆదివాసీ కుంబమేలాకు ప్రజల దర్శనార్థం సెలవులు ప్రకటించాలన్నారు. జాతర సందర్భంగా భక్తులుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, జాతరతో నష్టపోతున్న చుట్టుపక్కలా ఆదివాసీలకు పరిహారం అందజేసి, న్యాయం చేయాలన్నారు. ఏఎస్‌పీ నాయకులు ఆలెం లింగరాజు, వట్టం నాగేశ్వరరావు, శివరాం, ప్రసాద్, మునీంతర్, సోడీ కోటేశ్వరరావు, జిగట ముత్తయ్య పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠ


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభం ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10.26 నిమిషాలకు భక్తుల మేళతాళాల నడుమ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇంగువ రాజేశ్వరశర్మ సిద్ధాంతి ఆర్యాన వేద పండితులు బొడ్రాయి, నవగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ముఖ్య అతిధిగా పాల్గొని పూజలు చేశారు. కాగా, పూజలకు హాజరైన సుమారు 25 వేల మంది భక్తులకు ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యాన అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కట్ల రంగారావు, శీలం వెంకటన ర్సిరెడ్డి, కర్నాటి హనుమంతరావు, ఏదునూరి సీతారాములు, కట్ల సంతోష్, ఆలయకమిటీ సభ్యులు చింతనిప్పు మురళీధరరావు, కొల్లి వెంకటేశ్వరరావు, కొల్లినాగేశ్వరరావు, కొల్లి రమేష్, వెంకటేశ్వర్లు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను ప్రతిఘటిద్దాం

బోనకల్: బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. సోమవారం సీపీఎం మండల కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లయినా రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు రమేష్, పంతు, సురేష్, సునిత, మురళీకృష్ణ, కొటేశ్వరరావు, వెంకటరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

వితరణలు వెల్లువ..

రాగిజావ గిన్నెలు..

ముదిగొండ: ముదిగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాగి జావ తాగే గిన్నెలను పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు వారు సోమవారం వితరణ గావించారు. ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య చేతుల మీదుగా 300 రాగిజావ గిన్నెలను విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం కె.శాంతి, ఉపాధ్యాయులు సురేష్, గురవయ్య, బ్రహ్మాజీ, జయలక్ష్మి, సంధ్యశ్రీ, పద్మావతి, స్వరూప, రామారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు..

వైరారూరల్: మండలంలోని తాటిపూడి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం బండి గోపాలకృష్ణ, శ్రీదేవి దంపతుల కుమారుడు రాఘవ జన్మదిన వేడుకలను పురస్కరించుకోని విద్యార్థులు రాగి జావ తాగేందుకు గ్లాసులను వితరణ చేశారు. మాజీ సర్పంచ్ భట్టా పెద్ద భద్రయ్య, తాతా రవి, బాబు, తాతయ్య, షేక్.మదార్, వహీద్ షా, జానీ పాషా తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం ..

కారేపల్లి: ఆపదలో ఉన్న బాల్యమిత్రుడికి బాల్య మిత్రులు ఆపన్నహస్తం అందించి, నీకు మేమున్నామంటూ వెన్నుతట్టి భరోసా ఇచ్చారు. 1993లో కారేపల్లిలో హైస్కూల్ పదో తరగతి అభ్యసించిన పేరుపల్లికి చెందిన శివ ఆగర్వాల్ బ్రతుకుదెరువుకు హైద్రాబాద్ వెళ్లి తాత్కాలిక ఉపాధితో భార్యబిడ్డలను పోషించుకుంటున్నాడు. నాలుగు నెలల క్రితం రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలపాలై చికిత్స తీసుకుంటున్నాడు. వీరి ఆర్థిక సరిస్థితి తెలుసుకున్న బాల్య స్నేహితులు రూ.26 వేలు సేకరించి మిత్రుడికి అందించారు. ఈ కార్యక్రమంలో బాల్యమిత్రులు కందుల ప్రసాద్, నక్క వినయ్‌సాగర్, నిర్మల, తులసిరాం, ఆదెర్ల నాగేశ్వరరావులు ఉన్నారు.

విద్యార్థులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు..


విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందిస్తున్న లయన్స్ సభ్యులు

చింతకాని: పట్టుదల, క్రమశిక్షణతో చదువుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఖమ్మం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని లచ్చగూడెం కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని ఇంటర్, పదో తరగతి విద్యార్థినులకు సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూతను అందిస్తే విద్యాభివృద్ధిని సాధించుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి హనుమంతురావు, సభ్యులు ఈశ్వరరావు, విశ్వేశ్వరరావు, దుర్గా నాగేశ్వరరావు, గోవర్ధన్‌రావు, కృష్ణమూర్తి, సుబ్బారావు, గ్రామ మాజీ ఎంపీటీసీ గోవిందరావు, కేజీబీవీ కాంతకుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మిస్ట్ కళాశాల విద్యార్థిని ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక


విద్యార్థి ఇష్రత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ హరికృష్ణ, అధ్యాపకులు

సత్తుపల్లిరూరల్: స్థానిక మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్సీ విభాగంలో ఫైనలియర్ చదువుతున్న షేక్ ఇష్రత్ అనే విద్యార్థిని టెక్నోహ్యాండ్స్ ఇండియా ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నెలకు రూ.10వేలు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటుగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబ శివరావు, చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజ నీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, సియస్సి విభాగాధిపతి మారేశ్వరరావు అభినందించారు.

భూమి పూజ

సత్తుపల్లిరూరల్: మండలంలోని రేగళ్లపాడు గ్రామంలో ముత్యాలమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామస్తులు భూమిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణం పూర్తి అయిన తర్వాత గ్రామస్తులందరూ కలిసి బొడ్రాయి ప్రతిష్ఠ, ముత్యాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు.

అధికారులకు సన్మానం..

కారేపల్లి: సింగరేణి మండలంలో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన అధికారులను సోమవారం వివిధ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సర్పంచ్ భద్రునాయక్, యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు హర్షనాయక్, సాయికిరణ్‌ల ఆధ్వర్యంలో యువకులు ఎంపీడీఓ జి.సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్‌లను కలిసి, వారిని శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఉక్కు రష్యా నిర్మాత లెనిన్

ముదిగొండ: రష్యా దేశంలో తొలి సోషలిస్టు ప్రభుత్వం ఏర్పాటు చేసి సామ్రాజ్యవాద దేశాలకు ధీటుగా రష్యాని అభివృద్ధి పథంలో నడిపిన మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ అని సీపీఎం నేత పోతినేని సుదర్శన్ అన్నారు. ముదిగొండలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం రాత్రి శాఖ కార్యదర్శి ఇరుకు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు

వైరా ఏడీఏగా సతీష్‌కుమార్..


సతీష్‌కుమార్

వైరా: వైరా సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడి (ఏడీఏ)గా మిట్టపల్లి సతీష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వైరా ఏడీఏగా పనిచేసి వేల్పుల బాబూరావు పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఏఓ (జిల్లా వ్యవసాయాధికారి)గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఖమ్మం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ సతీష్‌కుమార్ వైరా ఏడీఏగా అదనపు బాధ్యతలు అప్పగించారు. వైరా సబ్‌డివిజన్ పరిధిలోని ఏఓలు పవన్‌కుమార్, బాలాజీ, నరసింహారావు, ఉమామహేశ్వరరెడ్డి, ఏడీఏ కార్యాలయ ఏఓలు వాహిని, కమలాకర్, స్వరూప తదితరులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంవీఐగా వర ప్రసాద్..


వరప్రసాద్

వైరా మోటర్ సైకిల్ ఇన్‌స్పెక్టర్‌గా 2012 బ్యాచ్‌కు చెందిన వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో సత్తుపల్లి, కరీంనగర్, కొత్తగూడెం చెక్‌పోస్టు, ఆదిలాబాద్ , ఖమ్మం, అశ్వారావుపేటలో ఎంవీఐగా పనిచేశారు. ప్రస్తుతం వైరా ఎంఈఐగా పని చేసిన బి.శంకరనాయక్ ఆదిలాబాద్ జిల్లా వాంకిడి చెక్‌పోస్టుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు.

సత్తుపల్లి ఎంవీఐగా యోగేశ్వర్‌సింగ్..


యోగేశ్వర్‌సింగ్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రాంతీయ రవాణాశాఖ అధికారిగా జె.యోగేశ్వర్‌సింగ్ జాదవ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య అశ్వారావుపేట చెక్‌పోస్టుకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో మంచిర్యాలలో ఎంవీఐగా పనిచేస్తున్న యోగేశ్వర్‌సింగ్ జాదవ్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కారేపల్లి ఎస్సైగా రాజారాం..


రాజారాం

కారేపల్లి: కారేపల్లి ఎస్సైగా ఎన్.రాజారాం సోమవారం బాధ్యతలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడూళ్ల బయ్యారం కరకగూడెంలో ఎస్సైగా పనిచేసిన రాజారాం బదిలీపై కారేపల్లికి వచ్చారు. కారేపల్లి ఎస్సైగా పనిచేసిన పుష్పాల రామారావును ఖమ్మం సీసీఎస్‌కు బదిలీ చేశారు.

నూరుశాతం పన్నులు వసూలు చేయండి


మున్సిపల్ కమిషనర్ ఎం.రవిబాబును సత్కరిస్తున్న చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లు

సత్తుపల్లిటౌన్: ఈ ఆర్థిక సంవత్సరంలో సత్తుపల్లి మున్సిపాలిటీలో ఆస్తి పన్నులను నూరుశాతం వసూలు చేసి లక్ష్యాలను సాధించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ రవిబాబును మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్లు కలిసి అభినందించి సత్కరించారు. ముందుగా వార్డు స్పెషలాఫీసర్లు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి పన్నులు చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. వార్డుల్లో అక్రమ నిర్మాణాలను గుర్తించాలని, చెత్త సేకరణ సక్రమంగా జరిగే చర్యలు తీసుకోవాలని, తాగునీటి పైపులైన్ లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్తూరు ఉమా, ఎస్‌కె ఛాంద్‌పాషా, అద్దంకి అనిల్, గుండ్ర రఘు, ప్రవీణ్, వేములపల్లి మధు, మారుతి సూరిబాబు, నడ్డి ఆనందరావు, అబ్దుల్లా, కృష్ణారావు, నర్సింహారావు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి


హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనదారులు ప్రయాణ సమయంలో విధిగా హెల్మెట్ ధరించాలని సత్తుపల్లి జేవీఆర్ ఓసీ పీఓ ఎస్.వెంకటాచారి అన్నారు. సోమవారం హెల్మెట్ ధరించటంపై సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు ఆదేశాలతో పీఓ ఆధ్వర్యంలో.. సింగరేణి ఉద్యోగులు పీవీ నరసింహారావు సెంటినరీ కాలనీ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీఆర్ ఓసీ పీఓ ఎస్.వెంకటాచారి మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి ఇంటి వద్ద నుంచి రక్షణ పరంగా విధులకు హాజరు కావాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ పీఓలు కె.దేవదాస్, డి.సందీప్, యూనియన్ ప్రతినిధులు ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ జి.నర్సింహారావు, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ ఎన్.రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: రాష్ట్రస్థాయి ఒలంపియాడ్‌లో సత్తుపల్లి వివి విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. హైద్రాబాద్ శ్రీనివాస రామానుజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఒలంపియాడ్‌లో పాఠశాల విద్యార్థులు పుశ్యాల్, ఉమావర్షిణి, జస్విత్, యువన్, వివేక్‌లు రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారు. సోమవారం హైద్రాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ర్యాంకర్లకు బహుమతులు, జ్ఞాపికలను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్‌నారాయణ్ అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఒగ్గు భాగవాన్‌రెడ్డి, హెచ్‌ఎం గొరంట్ల వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి


చింతకాని: నాగులవంచలో శివాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూ సామ్రాజ్య స్థాపనలో ఛత్రపతి శివాజీ మార్గదర్శకుడని పలువురు వక్తలు తెలిపారు. ఛత్రపతి మహరాజ్ జయంతి వేడుకలను సోమవారం పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. పలుచోట్ల పాలాభిషేకాలు, యువత బైక్ ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


మధిరరూరల్: శంకుస్థాపన చేస్తున్న దుర్గాభవాని

మధిర రూరల్ / చింతకాని / ఎర్రుపాలెం / వైరా రూరల్: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదనతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి మంజూరైన రూ.10 లక్షల నిధులతో మల్లవరం గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్గాభవాని శంకుస్థాపన చేశారు. అదే విధంగా చింతకాని మండలంలోని జగన్నాథపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ కోపూరి పూర్ణయ్య సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.7 లక్షల వ్యయంతో గ్రామంలో సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎర్రుపాలెం మండలంలోని వెంకటాపురం గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సోమవారం ఎంపీపీ శిరీష శంకుస్థాపన చేశారు. ఈజీఎస్ నిధులు రూ.5 లక్షల సీసీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. వైరారూరల్ మండలంలోని విప్పలమడక గ్రామంలో రూ.12 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం మాజీ సర్పంచ్ జాన్ పాపయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి సంపత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగార్జున్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గోవిందరావు, మాజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ సామేలు, కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహారావు, శ్రీనివాసరెడ్డి, పిచ్చిరెడ్డి, కృష్ణారావు, వెంకట్రామిరెడ్డి, రమేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మురళి, రాంబాబు, పంచాయతీ కార్యదర్శి వి.రామకృష్ణ, పీఆర్ ఇంజనీరింగ్ అధికారి అప్పారావు, మాజీ సర్పంచ్‌లు కృష్ణారావు, వీరభద్రరరావు, చెన్నకేశవరావు, అర్జున్‌రావు, వెంకటేశ్వరరావు, వెంకటచారీ పాల్గొన్నారు.